ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 325 | పేజీలు: 5 | వెల: రూ.3/- | గురువారం 5 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం

**మే 11 నుంచి తొలి దశ... తెలంగాణలో జనగణన తొలి దశకు రంగం సిద్ధం**

మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల వివరాల సేకరణ

దేశంలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ విధానంలో లెక్కింపు

సొంతంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్

ఏ ఒక్క ఇల్లు వదలకుండా పక్కాగా లెక్కించాలని అధికారులకు ఆదేశాలు



**హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం)**

దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన (జనగణన) ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.

**దేశంలోనే తొలిసారి డిజిటల్ లెక్కింపు**

ఈసారి జనగణన ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోనుంది. దేశ చరిత్రలోనే మొదటిసారి జనాభా లెక్కలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. ఇది సమాచార సేకరణలో వేగాన్ని, కచ్చితత్వాన్ని ..మిగతా 2లో



## అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

ఇటీవల లొంగిపోయిన మావో అగ్రనేతలతో జరిపిన చర్చల సారాంశాన్ని అమిత్ షా కు వివరించిన సీఎం

అమిత్ షాతో భేటీలో పాల్గొన్న డిజిపి బృందం

రేవంత్, డిజిపిని అభినందించిన అమిత్ షా

**న్యూఢిల్లీ, మార్చి 4 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. బుధవారం రాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఇటీవల లొంగిపోయిన మావో అగ్రనేతలతో జరిపిన చర్చల సారాంశాన్ని అమిత్ షా కు వివరించినట్లు తెలిసింది. వారు వెలిబుచ్చిన అభిప్రాయాల సాధ్యా, సాధ్యాలను కేంద్ర హోం మంత్రి తో చర్చించిన సీఎం రేవంత్. ఈ సమావేశంలో సీఎం వెంట తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ విజరు కుమార్ ఉన్నారు. ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహరెడ్డి తదితరులు తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఈ విషయాన్ని సిఎం రేవంత్, డిజిపిలు కేంద్రహోం మంత్రి అమిత్ షాకు వివరించినట్లు తెలుస్తోంది. తెలంగాణకు సంబంధించి నక్సల్స్ ..మిగతా 2లో

## ₹10 లక్షల కోట్లు ఆవిరి!

సెన్సెక్స్ 1100 పాయింట్లు డౌన్..



2

## ఆదిలాబాద్ జైలు నుంచి విడుదలైన బాల్క సుమన్

నా కొడుకు పుట్టినరోజుకు కూడా నన్ను దూరం చేశారు: బాల్క సుమన్

4

తనపై రివర్స్‌లో అక్రమ కేసులు పెట్టారని మండిపాటు

కాంగ్రెస్ నేతల కడుపు మంట తగ్గిందని వ్యాఖ్య





2

## చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

పలమనేరు వద్ద లారీని ఢీకొన్న కారు

అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు

మృతుల్లో ముగ్గురు మహిళలు

మృతులు కర్ణాటకకు చెందిన వారిగా గుర్తింపు

## నాకు స్పీకర్ నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు

దానం నాగేందర్

నెక్లెస్ రోడ్డులో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న దానం నాగేందర్

స్పీకర్ నుంచి వ్యక్తిగతంగా నోటీసులు రాలేదని వెల్లడి

రేపో ఎల్లుండో వెళ్లి తన అభిప్రాయాన్ని స్పీకర్‌కు తెలియజేస్తానన్న దానం నాగేందర్




2

## టెహ్రాన్ సమీపంలో అణుప్రాజెక్టును ధ్వంసం చేశాం ఇజ్రాయెల్

రహస్య భూగర్భ అణు ప్రాజెక్టును ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడి

ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పని చేస్తున్నట్లు సమాచారం అందిందని వెల్లడి

పక్కా సమాచారంతో దాడి చేశామన్న ఇజ్రాయెల్ రక్షణ దళం



2

## ప్రాజెక్టుల భూసేకరణకు 5000 కోట్లు

జూన్ 2 నాటికి భూసేకరణ పూర్తి

పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా

ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి

అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు

ప్రాజెక్టులపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో సమీక్ష

**హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం)**

సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ..మిగతా 2లో





## గల్ఫ్‌లో ఉద్రిక్తతలు..

4

భారతీయుల తరలింపునకు 58 ప్రత్యేక విమానాలు

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయుల తరలింపు

నేడు 58 ప్రత్యేక విమానాలను నడుపుతున్న ఇండియన్ క్యారియర్లు

ఇండిగో 30, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 23 ఫ్లైట్స్ ఏర్పాటు

# డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం




**మొదటి పేజీ తరువాయి...**

పెంచుతుంది. అంతేకాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు "సెల్ఫ్-ఎన్యూమరేషన్" పేరిట ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుందని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

**పక్కాగా వివరాలు నమోదు చేయాలి: సీఎస్**

క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సీఎస్ స్పష్టంగా ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు.

ఈ సమావేశంలో పాల్గొన్న జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి, డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ యాప్ పనితీరు, సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరి బాధ్యతలను ఆమె విశదీకరించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సమాచార సేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు, భవిష్యత్ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# ₹10 లక్షల కోట్లు ఆవిరి!

**న్యూఢిల్లీ, మార్చి 4 (ప్రభాత ఉదయం)**

పశ్చిమాసియాలో యుద్ధ ప్రకంపనలు దలాల్‌స్ట్రీట్‌నూ తాకాయి. ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ భారీగా పతనమయ్యాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు ధరలు పెరగడం, తాజా ఉద్రిక్తతల కారణంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు నెలకొన్నాయి. అదే జరిగితే అమెరికా ఫెడ్, ఆర్‌బీఐ ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. దీనికి తోడు ఎఫ్‌ఐఐల అమ్మకాలు, రూపాయి విలువ క్షీణించడం కూడా మన మార్కెట్ పతనాన్ని శాసించాయి. ఓ దశలో సెన్సెక్స్ 1700 పాయింట్లకు పైగా పతనం కాగా.. చివరకి 1100 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.10 లక్షల కోట్ల మేర ఆవిరై రూ.456 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 78,528.82 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,238.85) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,443.20 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1122.66 పాయింట్ల నష్టంతో 79,116.19 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 385.20 పాయింట్ల నష్టంతో 24,480.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.16గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా మినహా మిగిలిన కంపెనీల షేర్లు నష్టపోయాయ. టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరగా.. బంగారం ఔన్సు 5185 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవే.. అమెరికా- ఇరాన్ వార్**

ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్త ఆపరేషన్ ఐదోరోజుకు చేరింది. తాజాగా టెహ్రాన్, బీరుట్‌లపై దాడులు జరిగాయి. మరో నాలుగైదు వారాల పాటు యుద్ధం కొనసాగవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అంతకంటే ఎక్కువ కాలం కొనసాగినా అందుకు సిద్ధమని పేర్కొనడంతో యుద్ధం ఇంకెంత కాలం కొనసాగుతుందోనన్న భయాలు నెలకొన్నాయి.

**ముడి చమురు పైకి**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరింది. భారత చమురు అవసరాలు 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఈ నేపథ్యంలో చమురు ధరలు పెరగడంతో కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం, వృద్ధిపై భయాలు నెలకొన్నాయి.

**రూపాయి పతనం**

వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి ఏకంగా 92.18 మార్క్ వద్ద కనిష్ఠాన్ని తాకింది. రూపాయి విలువ పతనం వల్ల విదేశీ నిధులు తరలిపోయి కంపెనీల లాభదాయకతపై ప్రభావం పడుతుంది.

**ఎఫ్‌ఐఐల విక్రయాలు**

దీనికితోడు దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి నెలలో నెట్ సెల్లర్లుగా ఉన్న ఎఫ్‌ఐఐలు.. మార్చి 2న కూడా రూ.3,295 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

# ప్రాజెక్టుల భూసేకరణకు 5000 కోట్లు






**మొదటి పేజీ తరువాయి...**

ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సితక్క,వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ

విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ పై 2025 మధ్యకాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయన్నారు. 29.91 టీఎంసీల స్థూల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు 6,7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. డ్యామ్ భద్రత విషయంలో పూర్తి బలోపేతం జరిగే వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ దిగువన నీటిని పూర్తిగా వదలకుండా దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు మరియు అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2,3 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు, పంటల విరామం రాకుండా చూడాలన్నారు. ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయి; మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఆగస్టులో నిల్వలను భద్ర పరిమితులకు కట్టడి చేసి, నియంత్రిత నీటి విడుదలలు ప్రారంభించినప్పుడు ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందని, డిసెంబర్ నాటికి దశలవారీగా

ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాలెం వాగు గేట్లు,రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాలెంవాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు గాను అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 5,000 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జూన్ 2 వ తేదీ వరకు భూసేకరణ పూర్తి చేయాలని నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, , ఇంజనీరింగ్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.

సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. సింగూరు డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

ఆందోల్ నియోజకవర్గం లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం

పనులను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పనులకు ఉగాదిలోగా శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టాలని మంత్రులు ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టు సుందరీకరణ , పరిరక్షణ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆందోల్ నియోజకవర్గం లో చిన్న నీటి ప్రాజెక్టులైనా చెరువుల పునరుద్ధరణ పనుల టెండర్లను పూర్తి చేసి ఈ సీజన్లో రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు.



## చిత్తూరు జిల్లాలో
# ఘోర రోడ్డు ప్రమాదం

### పలమనేరు వద్ద లారీని ఢీకొన్న కారు
### అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు
### మృతుల్లో ముగ్గురు మహిళలు
### మృతులు కర్ణాటకకు చెందిన వారిగా గుర్తింపు

**చిత్తూరు మార్చి 4 (ప్రభాత ఉదయం)**

చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలో ఈ ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్తున్న కారు, ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ భీకర సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులలో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. ప్రమాద ధాటికి కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే పలమనేరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులంతా కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారుగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ఘోరం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుల పూర్తి వివరాల కోసం కర్ణాటక పోలీసులతో కూడా సంప్రదింపులు జరుపుతున్నారు.

# అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**మొదటి పేజీ తరువాయి...**

నిర్మూలన జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా సిఎం రేవంత్‌ను, డిజిపి బృందాన్ని అభినందించారు. దేశంలో మావోయిస్టులు నిర్మూలించేందుకు కేంద్రం నిర్దేశిరచుకున్న లక్ష్యం ఆపరేషన్ కగార్ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. అలాంటి వేళ.. మార్చి మొదటి వారంలో అగ్రనేతలంతా ఒకేసారి తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అలాగే మావోయిస్ట్ పార్టీ కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు నేపాల్‌లో ఉన్నారంటూ వార్త కథనాలు వెలువడ్డాయి. ఆయన ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని సదరు కథనాల్లో స్పష్టం చేశారు. ఆయన్ని స్వదేశం తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారాంటూ ప్రచారం సాగుతోంది. ఇంకోవైపు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న గణపతి లొంగిపోవాలంటూ ఆయన సోదరుడు ఇప్పటికే విడియా ద్వారా కోరిన విషయం విదితమే. ఈ మావోయిస్ట్ అగ్రనేతలు ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసులు ఎదుట లొంగిపోయారు. వీరి లొంగుబాటులో తెలంగాణ పోలీసులు అత్యంత కీలకంగా వ్యవహరించారనే ప్రచారం సాగుతోంది. అలాంటి వేళ.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో డీజీపీతోపాటు సుమతి, విజరు కుమార్‌లను అమిత్ షా స్వయంగా అభినందించారని తెలుస్తోంది.

## నాకు స్పీకర్ నుంచి ఎలాంటి
# నోటీసులు రాలేదు

**మొదటి పేజీ తరువాయి...**

అనర్హత పిటిషన్లకు సంబంధించి తనకు ఎలాంటి నోటీసులు అందలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. స్పీకర్ నుంచి తనకు వ్యక్తిగతంగా నోటీసులు అందలేదని వెల్లడించారు. నోటీసులు రేపు అందే అవకాశం ఉందని అన్నారు. అయితే రేపో ఎల్లుండో తాను నేరుగా తన అభిప్రాయాన్ని స్పీకర్‌కు తెలియజేస్తానని అన్నారు. నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన హోలీ వేడుకల్లో దానం నాగేందర్ పాల్గొన్నారు. కార్యకర్తలతో కలిసి ఆయన కాసేపు హోలీ ఆడారు. అనంతరం ఇంటికి వెళ్లే సమయంలో ఆయన అనర్హత పిటిషన్ అంశంపై మాట్లాడారు. తన చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చి యువతతో డ్యాన్స్ చేశానని తెలిపారు.

# టెహ్రాన్ సమీపంలో అణుప్రాజెక్టును ధ్వంసం చేశాం
## ఇజ్రాయెల్


### రహస్య భూగర్భ అణు ప్రాజెక్టును ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడి
### ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పని చేస్తున్నట్లు సమాచారం అందిందని వెల్లడి
### పక్కా సమాచారంతో దాడి చేశామన్న ఇజ్రాయెల్ రక్షణ దళం

**టెహ్రాన్, మార్చి 4 (ప్రభాత ఉదయం)**

ఇరాన్‌లోని రహస్య భూగర్భ అణు ప్రాజెక్టును ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదేహైలో రహస్యంగా ఏర్పాటు చేసిన ఈ అణు ప్రాజెక్టుపై దాడి చేసినట్లు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డెఫ్రిన్ వెల్లడించారు. ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం అందిందని, దీనితో దాడి జరిపినట్లు ఐడీఎఫ్ తెలిపారు. 2025లో అమెరికా దాడుల తర్వాత ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఇక్కడకు మళ్లించిందని వెల్లడించారు. గత ఏడాది జూన్ నెలలో ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో 12 రోజుల పాటు దాడులు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ రోజు దాడికి ఉపయోగించిన మందుగుండు సామాగ్రి కంటే ఈ నాలుగు రోజుల్లో ఉపయోగించిందే ఎక్కువ అని తెలిపారు. గతంలోనే ఇరాన్ అణుస్థావరాలపై తాము దాడులు చేశామని డెఫ్రిన్ తెలిపారు. అయినప్పటికీ ఆ దేశం అణు కార్యకలాపాలను ఆపలేదని అన్నారు. అణ్వాయుధాలను టెహ్రాన్ శివార్లలోని రహస్య భూగర్భ స్థావరంలో భద్రపరిచిందని, దీనికి సంబంధించి తమకు కచ్చితమైన సమాచారం రావడంతో ఆ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నామని డెఫ్రిన్ వెల్లడించారు.



హోళీ సందర్భంగా రంగులాడిన చిన్నారి చైత్ర



హోళీ రంగులతో చిన్నారి



హోళీ వేడుకలలో మార్కండేయనగర్ కు చెందిన శ్రేయాన్, హర్తిక్ లు



హైదర్ గూడ లో హోళీ వేడుకలలో పాల్గొన్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో సంతోషంగా హోళీ వేడుకలు

**రాజేంద్రనగర్, మార్చి 4 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో బుధవారం హోళీ పండుగ ను చిన్నా, పెద్ద అనే తారతమ్యం లేకుండ ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకున్నారు. హోళీ అం టేనే రంగుల పండుగ అని, ఈ పండుగను ఆనందంగా, సంతోషంగా సంవత్సరానికి ఒక్క సారి మాత్రమే జరుపుకుంటామని చెబుతు ప్రతి ఒక్కరు హోళీ సంబరాలలో మునిగి తేలారు. బీజేపీ రాజేం ద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి, మాజీ కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గం ప్రజలకు హోళీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. హోళీ వేడుకలలో చిన్నారులు ప్రత్యేక ఆకర్శణగా నిలిచారు. హైదర్ గూడ ప్రణవ భక్త సమాజం సభ్యులు బస్తీలో యువకులు, వివిధ పార్టీల నాయకులతో కలసి హోళీ వేడుకలలో పాల్గొన్నారు





హోళీ పండుగ సందర్భంగా బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ, మాజీ కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ని కలసిన మహిళలు, పారిశుధ్య కార్మికులు



హోళీ ఆడుతున్న జర్నలిస్టు ఎం బాలసుబ్రమణ్యం కుటుంబ సభ్యులు



అత్తాపూర్ లక్ష్మీ నగర్ పార్కు లో హోళీ ఆడుతున్న కాలనీ వాసులు ...



చిన్నారులతో కలసి హోళీ వేడుకలలో పాల్గొన్న శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెండ్యాల సాయి మల్లిక్..



హోళీ వేడుకలలో ఎమ్మార్పీఎస్ నాయకులు వనం నరసింహ మాదిగ



బండి వెంకట్ రెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దుంబాల ఉమా రెడ్డి, తదితరులు

## గొప్ప నాయకులు
# బండి వెంకట్ రెడ్డి

**బుద్వేల్, మార్చి 4 (ప్రభాత ఉదయం)**

ప్రేమావతి పేట్ వాస్తవ్యులు, రాజేంద్రనగర్ మున్సిపాలిటీ సీనియర్ నాయకుడుగా పేరున్న బండి వెంకట్ రెడ్డి మరణం తీరని లోటు అని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు దుంబాల ఉమా రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుంబాల ఝాన్సీ రెడ్డి లు అన్నారు. బుధవారం శివరాంపల్లి ప్రజా భవన్ లో కుమారుడు బండి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో దివంగత బండి వెంకట్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకట్ రెడ్డి సేవలను కొనియాడారు. మంచి వక్తగా ఆయనకు గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో ప్రేమావతి పేట్ వాస్తవ్యులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, బండి వెంకట్ రెడ్డి భార్య బండి ఉమా, కుమారుడు బండి శేఖర్ రెడ్డి - లక్ష్మీ , కూతుళ్ళు కవిత, కృష్ణా రెడ్డి, రజిత, బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సరిత, మల్లేశ్వర్ రెడ్డి, దుంబాల వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.




శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలతో
వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బల రాం

# పంటల అధిక దిగుబడులకు నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలి : డాక్టర్ ఎం బలరాం

**బుద్వేల్, మార్చి 4 (ప్రభాత ఉదయం)**

నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయడం ద్వారా పంటల దిగుబడి పెరగడంతో పాటు నేల ఆరోగ్యం దీర్ఘ కాలికంగా మెరుగుపడుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నేల ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో బుధవారం నేల పరీక్షలు, స్థానిక వాతావరణ ప్రభావాలు, పంటల వ్యవస్థలు, సేంద్రీయ ఎరువుల వినియోగం పై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో వర్శిటీ లోని సెంటర్ ఫర్ హ్యూమన్ రీసోర్స్ డెవలప్మెంట్ ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రీయ ఎరువుల ప్రాముఖ్యత, వాతావరణ పరిస్థితులకణుగుణంగా పంటల ప్రణాళిక రూ పొందించడం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని సాదించవచ్చని డాక్టర్ ఎం బలరాం తెలిపారు. ఈ రకమైన శిక్షణ ద్వారా స్వంతంగా లాబరేటరీని ఏర్పాటు చేసుకునే నైపుణ్యం వస్తుందన్నారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పరిజ్ఞానం చేరేలా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. పరిశోధన సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతను రైతులకు చేరవేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాధకతను పెంచవచ్చున్నారు. సెంటర్ ఫర్ హ్యూమన్ రీసోర్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమం రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను పరిచయం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఈ శిక్షణ లో నేల నమూనాల సేకరణ, నేల పరీక్షా విధానాలు, నేల పరీక్షా ఫలితాల విశ్లేషణ, వాతావరణ ప్రభావాల అవగాహన, పంటల ప్రణాళిక, సేంద్రీయ ఎరువుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్య విభాగం ప్రిన్సిపల్ సైంటిస్ట్ హెడ్ డాక్టర్ ఎ మాధవి. ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుకృత కుమార్, డాక్టర్ ఎం శంకర్, డాక్టర్ రెడ్డి ప్రియ లు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి ప్రజలకు సంతోషవార్త
# నల్లచెరువు పునరుద్ధరణకు శుభారంభం!

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**కూకట్‌పల్లి, మార్చి 4(ప్రభాత ఉదయం)**




కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి ప్రాంతానికి ఆహ్లాదాన్ని పంచే చారిత్రాత్మక నల్లచెరువు ఎట్టకేలకు ఈ వారంలో ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. పదో తేదీలోపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా నల్లచెరువు వద్దకు విచ్చేసి అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష ప్రారంభోత్సవానికి ముందుగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, సిఎంసి, హైడ్రా అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మురికి కూపం నుంచి మణిహారం దాకాఒకప్పుడు మురికి నీరు, చెత్తతో నిండిపోయి దుర్వాసనతో ప్రజలను ఇబ్బంది పెట్టిన నల్లచెరువు నేడు హైడ్రా ఆధ్వర్యంలో అందమైన వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల ఆట స్థలాలు, పచ్చదనం, విశ్రాంతి వేదికలతో అలరారుతోంది. ఇంకా అధికారికంగా ప్రారంభం కాకముందే సుమారు ఐదు కిలోమీటర్ల దూరం నుంచి ప్రజలు ఇక్కడికి వచ్చి వాకింగ్ చేస్తూ, పిల్లలతో ఆటలు ఆడుతూ ఆనందంగా గడుపుతున్నారు. నిరసనల నడుమ ప్రారంభమైన మార్పు 2024 సెప్టెంబరులో చెరువు ఆక్రమణలను తొలగించినప్పుడు పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం మద్దతుతో హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ పనులు ఇప్పుడు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి. భూగర్భ జలాలు పెరిగి, వరదలు తగ్గుముఖం చెరువు పునరుద్ధరణతో గ్రౌండ్ వాటర్ లెవెల్ గణనీయంగా పెరిగిందని, వరద ముప్పు కూడా తగ్గిందని కమిషనర్ వెల్లడించారు. ఇది కేవలం సుందరీకరణ కాదూ పర్యావరణ పరిరక్షణకు, భవిష్యత్ తరాలకు నీటి భద్రతకు తీసుకున్న కీలక నిర్ణయమని పేర్కొన్నారు. త్వరలో ఎస్టీపీ నిర్మాణం నల్లచెరువు వద్ద త్వరలోనే ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణం చేపడతామని రంగనాథ్ తెలిపారు. ప్రతి చెరువు వద్ద ఎస్టీపీ ఏర్పాటు చేయాలనే హైకోర్టు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం శుద్ధి చేయని నీటిని నేరుగా మూసీలోకి వదిలేయడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, ఎస్టీపీ నిర్మాణంతో ఆ సమస్యలకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. మరిన్ని చెరువులకు హైడ్రా పునర్జీవంత్వరలో కూకట్‌పల్లి పరిధిలోని ఐడియల్ చెరువు, అమీర్ చెరువు, చందానగర్ గంగారం చెరువు, ఈర్ల చెరువు, ఎర్రకుంట చెరువులను కూడా హైడ్రా అభివృద్ధి చేయనుంది. ఏడాది వ్యవధిలో కూకట్‌పల్లి, శేర్లింగంపల్లి పరిధిలో ఆరు చెరువులకు పైగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే కాలంలో హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 25 చెరువులను హైడ్రా పునరుద్ధరించనుందని కమిషనర్ స్పష్టం చేశారు. కూకట్‌పల్లి నల్లచెరువు పునరుద్ధరణతో నగరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యం ఉ మూడు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమం అతున్నాయి. ఇక ప్రారంభోత్సవంతో ఈ ప్రాంతం మరింత రద్దీగా మారి, ప్రజల వినోదానికి, ఆరోగ్యానికి కేంద్రబిందువుగా నిలవనుంది.

## స్టూడెంట్ వీసాలపై వచ్చి డ్రగ్స్ విక్రయిస్తూ పోలీసులకు పట్టుపడ్డ
# యెమెన్, పాలస్తీనాలోని గాజా దేశాలకు చెందిన యువకులు

### రూ 25 లక్షల విలువ చేసే ఎండిఎంఎ డ్రగ్ స్వాదీనం

**బుద్వేల్, మార్చి 4(ప్రభాత ఉదయం)**

స్టూడెంట్ వీసాలపై భారత్ కు వచ్చి వీసా గడువు ముగిసిన ఇక్కడనే ఉంటూ డ్రగ్స్ అమ్మకాలు చేస్తున్న ఇద్దరు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు, హైద్రాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డిసిపి ఎస్ శ్రీనివాస్ అడిషనల్ డీసీపీ కే శ్రీనివాస్ రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ ఇన్స్ పెక్టర్ ఎం ముత్తు యాదవ్, హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ ఇన్స్ పెక్టర్ డానియల్, ఎస్సై వెంకట్ రాములు లతో కలిసి వెల్లడించారు. యెమెన్ దేశానికి చెందిన అకర్ అబ్దురబు మొహమ్మద్ అబ్దుర బు (37) విద్యార్థి వీసా పై



స్వాదీనం చేసుకున్న ఎండీఎంఏ డ్రగ్ ను చూపుతున్న
రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్

భారతదేశానికి వచ్చి హైదరాబాద్ నగరంలోని తొలిచౌకి లో నివాసం ఉంటున్నాడు. అతని వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండి డ్రగ్స్



వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్

అమ్మకాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతనిపై ఆరు కేసులు ఉన్నాయి. ఇతనికి పాలస్తీనా గాజా దేశానికి చెందిన హసన్ డబ్ల్యు ఎ హాషీమ్ (28) స్నేహితుడు. ఇతను కూడా స్టూడెంట్ వీసా పై వచ్చి బెంగళూరు లో నివాసం ఉంటున్నాడు. ఇతని వీసా గడువు కూడా ముగిసింది. హసన్ పై నాంపల్లి లో , బెంగళూరు లో రెండు కేసులు ఉన్నాయి. వీరికి ఢిల్లీ కి చెందిన డ్రగ్స్ విక్రయదారుడు, నైజీరియా కు చెందిన చిడి తో పరిచయం ఏర్పడింది. వీరు సీనియర్ మ్యాన్ అనే మరొక వ్యక్తిని స్నేహం కొని డ్రగ్స్ ను విక్రయిస్తున్నారు ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారము మేరకు అకర్ అబ్దురబు మొహమ్మద్ అబ్దురబు తో పాటు హసన్ డబ్ల్యు ఎ హాషీమ్ లను మంగళవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం నుంచి ఆరాంఘర్ వెళ్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 150 గ్రాముల ఎం డీ ఎం ఎ డ్రగ్ తో పాటు ఒక కత్తి ని స్వాదీనం చేసుకున్నారు. వీరు డ్రగ్స్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు... ఎవరెవరికి విక్రహిస్తున్నారు... ఎంత కాలం నుంచి డ్రగ్స్ విక్రయిస్తున్నారు అనే వివరాలను సేకరిస్తున్నామన్నారు. యువకులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి : డీసీపీ ఎస్ శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల తో నగరంలో నషా ముక్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ తెలిపారు విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు. అదే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, యాజమాన్యాలు నిఘా పెట్టి ఎవరు డ్రగ్స్ జోలికి వెళ్లకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# తహసిల్దార్ కార్యాలయాలలో రాజ్యమేలుతున్న అవినీతి..!

**చిన్న స్థాయి ఉద్యోగి నుంచి తహసిల్దార్ వరకు పైసా లేనిదే పని కాదు**

**అవినీతికి కేరాఫ్ తహసిల్దార్ కార్యాలయాలు**

**ముడుపులు అందజేస్తే.. చకచకా పనులు**

**ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్లు తహసిల్దార్ కార్యాలయాలకు వెళ్లాలంటేనే జంకుతున్న సామాన్యులు**

**దళారులను, పైరవీకారులను కలిశాకే పనులు**

**పనికో రేటు.. లేదంటే రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే**

**వేలల్లో జీతాలు తీసుకుని ఉద్యోగులు ఇలా బరితెగించడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**




**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 4(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారిందని మండలాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మామూళ్లు ఇవ్వనిదే అక్కడ ఏ పనులు జరగవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కార్యాలయాలో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. అటెండర్ నుంచి మొదలు పెడితే అధికారుల వరకు ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారిని అధికారులు, సిబ్బంది నెలల తరబడి తిప్పుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే సకాలంలో పనులు జరగక విసుగుచెందిన వారు కార్యాలయంలో ఎంతో కొంత ముట్టజెప్పి తమ పనులు చేయించుకుంటున్నట్లు సమాచారం. అంతటితో ఆగకుండా అక్రమంగా భూముల పట్టాలను అటు ఇటుగా మార్పిడి చేస్తూ ప్రజలను నిలువుదోపిడి చేస్తున్నట్లు గద్వాల, మల్దకల్, అయిజ, గట్టు, తదితర మండలాలో జోరుగా ప్రచారం సాగుతుంది. ఏది ఏమైన అక్రమ సంపాదనే ధ్యేయంగా అధికారులు కంకణం కట్టుకున్నారని తెలుస్తుంది. అక్రమాలకు తోడు భూముల ధరలు ఆకాశానికి తాకడం వారికి కలిసి వచ్చే అంశంగా చెప్పాలి. కార్యాలయానికి వచ్చే మధ్యవర్తుల ద్వారా సైతం అధికారులు రాయబారం నడుపుతూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లం అవుతుంది.

**ప్రతి పనికీ ఒక రేటు?**

రైతులు తమ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు చేసుకోవడానికి ప్రభుత్వం నిబంధనల ప్రకారం మీ సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకొని తాసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారు. అయితే ఇక్కడ రైతులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ చేసే భూమిని బట్టి రూ.1000 నుంచి రూ.5000 ఫైలుకు ఇంత అని కింది స్థాయి సిబ్బంది వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే ఫైలు వెనక్కి పోవాల్సిందే.

**తహసీల్దార్ ల ఇష్టారాజ్యం**

లంచమిస్తేనే పనులు చేస్తున్నారని జిల్లాలోని పలువురు తహసీల్దార్లపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయాలకెళ్లే వారిని రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఏదో రకంగా ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలున్నాయి.

కొందరు తహసీల్దార్లు భూభారతి దరఖాస్తులను ఆసరాగా తీసుకొని అందిన కాడికి దండుకుంటుంటే.. మరికొందరు ఏకంగా రూ. లక్షల విలువ చేసే ప్రభుత్వ భూములకే ఎసరు పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా అక్రమార్కులతో చేతులు కలిపి రికార్డులను తారుమారు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని ఓ మండలంలో ఓ రైతు తాతలకాలం నుంచి భూమి పొజిషన్ లో ఉంటూ సాగు చేస్తున్నాడు. తహసీల్దార్ నిర్వాహం వల్ల రికార్డులోనుంచి తొలగించి ప్రభుత్వ భూమి రికార్డులోకి ఎక్కడంతో న్యాయం చేయాలని అర్డిఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసిన అధికారులు కనికరించలేదు. దీంతో తనకు జరిగిన అన్యాయంపై కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ప్రభుత్వ భూమిని అమ్మడం, కొనడం నిషేధమైనా తహసీల్దార్ అక్రమార్కులతో కుమ్మక్కై రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్దకల్ మండల తహసీల్దార్ ఓ అర్సీ ఉన్న ఇనాం భూముల రిజిష్టర్ కోసం బహిరంగానే రూ.5-10వేలకు డిమాండ్ చేస్తుందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ భూములున్న రైతులు బ్యాంకు రుణాలు తీసుకుని బ్యాంకర్లకు తెలియకుండానే ఇతరులకు విక్రయిస్తున్నారు. ఇదే ఆసరగా తీసుకుని తహసీల్దార్ కాసులకు కక్కుర్తి పడి రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో మల్దకల్ మండలంలో వెలుగులోకి వచ్చింది.

**జీపీఓల ఇష్టారాజ్యాం**

రెవెన్యూకు పూర్వ వైభవం తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇతర శాఖలో సర్దుబాటు అయిన వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను పునరుద్ధరించి వారిని గ్రామ పాలనాధికారులుగా నియమించింది. జీపీవోలుగా గ్రామాల్లో వివిధ ధ్రువ పత్రాల జారీకి సంబంధించిన విచారణలు నిర్వహించడం, ప్రభుత్వ భూములు, నీటి వనరుల ఆక్రమణలపై విచారణ నిర్వహించి పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. భూ వివాదాలు పరిశీలించడం.. సర్వేయర్లకు సహకరించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. విపత్తుల సమయాల్లో దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టడం తో పాటు అత్యవసర సేవలను అందించాలి. కాని జీపీఓలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కేటిదొడ్డి మండలంలో ఓ గ్రామానికి చెందిన ఓ రైతు మరణిస్తే కుటుంబసభ్యుల పేరిట విరాసత్ చేయడానికి జీపీఓ అయిదు నుంచి పది వేల రూపాయలు డిమాండ్ చేయడంతో రైతు లబోదిబోమంటున్నాడు.



## ఆదిలాబాద్ జైలు నుంచి విడుదలైన బాల్క సుమన్

**నా కొడుకు పుట్టినరోజుకు కూడా నన్ను దూరం చేశారు: బాల్క సుమన్**

**తనపై రివర్స్‌లో అక్రమ కేసులు పెట్టారని మండిపాటు**

**కాంగ్రెస్ నేతల కడుపు మంట తగ్గిందని వ్యాఖ్య**

**ఆదిలాబాద్ మార్చి 4 (ప్రభాత ఉదయం):**

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మునిసిపల్ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుకు సంబంధించి సుమన్ తో పాటు మరికొందరు నేతలు కూడా జైలు నుంచి బయటకు వచ్చారు. జైలు నుంచి విడుదలైన అనంతరం సుమన్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసులు తమపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా, రివర్స్‌లో అక్రమ కేసులు పెట్టారని ఆయన మండిపడ్డారు. కేవలం 7 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్, మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. జిల్లా అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా, మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యక్తిగత సిబ్బందిలా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము ఎన్నడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని, తనను జైలులో పెట్టడం ద్వారా అధికార పార్టీ నాయకుల కడుపు మంట తగ్గిందని అన్నారు. హోలీ పండుగ మరియు తన కుమారుడి పుట్టినరోజున కూడా తనను దూరంగా ఉంచారని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు.

## గల్ఫ్‌లో ఉద్రిక్తతలు..

**భారతీయుల తరలింపునకు 58 ప్రత్యేక విమానాలు**

**మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయుల తరలింపు**

**నేడు 58 ప్రత్యేక విమానాలను నడుపుతున్న ఇండియన్ క్యారియర్లు**

**దుబాయ్, మార్చి 4 (ప్రభాత ఉదయం):**

మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తరలించేందుకు భారత విమానయాన సంస్థలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఇవాళ ఒక్కరోజే 58 ప్రత్యేక విమానాలను నడుపుతున్నట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇందులో ఇండిగో 30 విమానాలను, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కలిసి 23 విమానాలను నడపనున్నాయి.పశ్చిమాసియాలోని చాలా దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడం లేదా కఠిన ఆంక్షలు విధించడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ వంటి సంస్థలు దుబాయ్, ఫుజైరా వంటి నగరాల నుంచి ఈ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నాయి. ఈ విమానాలు న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొచ్చి, అహ్మదాబాద్, తిరువనంతపురం విమానాశ్రయాలకు చేరుకోనున్నాయి.ప్రస్తుతం దుబాయ్ గగనతలం పాక్షికంగా మాత్రమే తెరిచి ఉంది. పరిమిత సంఖ్యలో విమానాలకు అనుమతినిస్తున్నారు. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థ నుంచి నిర్ధారిత బయలుదేరే సమయం గురించి సమాచారం అందిన తర్వాతే విమానాశ్రయానికి రావాలని అధికారులు ప్రయాణికులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. అప్పటివరకు దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లవద్దని కోరారు. మరోవైపు అబుధాబి నుంచి తమ కార్యకలాపాలను గురువారం (మార్చి 5వ తేదీ) మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఎతిహాద్ ఎయిర్‌వేస్ ప్రకటించింది.ప్రయాణికుల భద్రతే తమకు అత్యంత ముఖ్యమని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రిఫండ్‌లు, రీషెడ్యూలింగ్, ఇతర సహాయక చర్యల విషయంలో ప్రయాణికులతో పారదర్శకంగా వ్యవహరించాలని అన్ని విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్లిష్ట సమయంలో విమాన టికెట్ల ధరలు అదుపు తప్పకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రయాణికులపై అనవసర భారం పడకుండా చూస్తామని మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.




## అనుచిత ఫోన్ కాల్స్‌కు దూరంగా ఉండాలి

**సైబర్ నేరగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలి**

**బొల్లారం ప్రవేశా పరిశ్రమలో అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీసులు**

**పటాన్ చెరు, మార్చి 4 (ప్రభాత ఉదయం):**

హాలీడే ప్యాకేజీ ఫేక్ కస్టమర్ సర్వీస్ సెల్ టవర్ ఏర్పాటు హోటల్ బుకింగ్ పేరుతో అనుచిత ఫోన్ కాల్స్ చేస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ప్రవేశ పరిశ్రమ లో బొల్లారం పోలీసులు కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బొల్లారం ఎస్ ఐ కిష్టారెడ్డి ,సైబర్ క్రైమ్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం లో కార్మికులకు పలు సూచనలు చేశారు. ప్రతీ వారం నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



## వయసు వ్యత్యాసం లేకుండా జరుపుకునే పండుగ హోలీ

**నీలం మధు ముదిరాజ్**

**పటాన్ చెరు, మార్చి 4 (ప్రభాత ఉదయం):**

వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సంతోషంగా రంగులు చల్లుకుంటూ జరుపుకునే వేడుక హోలీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం హోలీ పండుగ సందర్భంగా ఆయన ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి చిట్కుల్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు ప్రజలతో కలిసి ఆహ్లాదకర వాతావరణంలో హోలీ జరుపుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుని తపస్సును భంగపరిచినందుకు కామదేవుడిని శివుడు తన త్రినేత్రంతో బూడిద చేస్తాడు, ఆ తర్వాత కామదేవుని భార్య రతి కోరిక మేరకు శివుడు కాముడిని బ్రతికిస్తాడు, ఈ సంఘటనను గుర్తుచేస్తూ దేశవ్యాప్తంగా హోలీ జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఆనందోత్సాహాల మధ్య చిన్నా పెద్దా తేడా లేకుండా అందరితో కలిసి ఆయన హోలీ పండుగ సంబరాలు నిర్వహించారు.

## దేశ ప్రజలందరు ఐక్యంగా ఉండాలని కోరుతు ఉత్తర్ ప్రదేశ్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర

**బుద్వేల్, మార్చి 4 (ప్రభాత ఉదయం)**




దేశ ప్రజలందరు ఐక్యంగా ఉండాలనే సంకల్పంతో ఉత్తరప్రదేశ్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేస్తున్న అశోక్ శుక్లా బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం గగన్పహడ్ కు చేరుకున్నాడు. 2026 జనవరి 1వ తేదీన ఉత్తర్ ప్రదేశ్ నుంచి పాదయాత్ర ప్రారంభించానన్నారు.. తనది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సీతాపూర్ జిల్లా అని వివరించారు. దేశ ప్రజలందరు ఐక్యంగా ఉండి ప్రపంచదేశాలకు మన ఐక్యత ను చాటాలన్నదే తన ఉద్దేశ్యమన్నారు. జాతీయ పతాకాన్ని చేత పట్టుకుని అశోక్ శుక్లా పాదయాత్ర చేస్తున్నాడు.






# చార్మినార్ వద్ద బాల్య వివాహాల విముక్తి రథ యాత్ర

**చార్మినార్,మార్చి 4( ప్రభాత ఉదయం)**

ఆశ్రిత సంస్థ.జస్ట్ ఫర్ రైట్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బాల్య వివాహాల విముక్తి రథ యాత్రను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ.జడ్జి పి.అరుణ కుమారి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జడ్జి అరుణ కుమారి మాట్లాడుతూ... బాల్య వివాహలపై అవగాహన కల్పించటం వల్ల బాల్య వివాహాలు తగ్గుతున్నాయని తెలిపారు.చార్మినుంచి ప్రారంభమైన రథ యాత్ర గుల్జార్ హౌస్ వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా బాలల రక్షణ అధికారి శ్రీనివాస్.కాంగ్రెస్ నాయకులు కే.వెంకటేష్. ఆశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజ్.మేనేజర్ వి.పర్వతాలు తో పాటు పలువురు పాల్గొన్నారు

# జలమండలిలో 13 మంది ఉద్యోగులు పదవీ విరమణ

హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం)

*జలమండలిలో పనిచేస్తున్న పదమూడు మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వారిని తేది 04.03.2026, బుధవారం రోజున ఖైరతాబాద్ లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం సురేష్, జీఎం సరస్వతి పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.*



# కేంద్ర జాబితాలో లేని 40 బిసి కులాలు

## జనగణనలో వారిని కూడా చేర్చేలా చూడాలి... సిఎస్‌ను కోరిన తెలంగాణ బిసి కమిషన్

హైదరాబాద్, మార్చి 04(ప్రభాత ఉదయం):

తెలంగాణ రాష్ట్రంలో జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు గృహాల నమోదు జరగనుంది. ఆ తర్వాత జనాభా గణన 2027 ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 28, వరకు జరగనుంది. జనగణనలో కేంద్ర ప్రభుత్వ ఓబీసీ లిస్టులో ఉన్న తెలంగాణలోని 90 కులాల ప్రజలను మాత్రమే ఓబీసీలుగా గణనలోకి తీసుకోవడం జరుగుతోంది. తద్వారా తెలంగాణలో ఉన్న బీసీ కులాల సంఖ్యను తక్కువగా చూపెట్టే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 130 కులాలను వెనుకబడిన తరగతుల కులాలుగా గుర్తించడం జరిగింది. కాని కేంద్ర ప్రభుత్వం ఓబీసీ లిస్ట్‌లో కేవలం 90 కులాలను మాత్రమే చేర్చి 40 కులాలను చేర్చడం జరగలేదు. తద్వారా తెలంగాణలో బీసీల సంఖ్య తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉంది. బీసీ లిస్ట్‌లో లేని 40 కులాలను కూడా ఓబీసీ లిస్ట్‌లో చేర్చాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం, బీసీ కమిషన్ తరపున కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. కాని ఇప్పటివరకు దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ 40 కులాలను ఓబీసీ లిస్ట్‌లో చేర్చిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రంలో జనగణనను ప్రారంభించాలి. విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకొచ్చి తెలంగాణ రాష్టానికి చెందిన 40 బీసీ కులాలను కేంద్ర ఓబీసీ లిస్ట్‌లో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేయడం జరిగిందని బిసి కమిషన్ తెలిపింది.




వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ జ్యోతి

# వీధి దీపాలను రిపేర్ చేసి కొత్త లైట్లు వేయాలి

## 3వ వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి గోపి

జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 04(ప్రభాత ఉదయం):

జనగామ మున్సిపల్ కమిషనర్ కు 3వ వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి గోపి తన మూడవ వార్డులో వెలుగని వీధిదీపాలను రిపేర్ చేసి కొత్త లైట్లు వేయాలిని, కరెంటు పోల్స్ కు పైపులు, క్లాంప్స్ లేని కొత్తవి అమర్చి లైట్లు వేయాలని బుధవారం కమీషనర్ కు వినతిపత్రం ఇచ్చారు.వార్డులోని బాలాజీ నగర్, జ్యోతి నగర్, ఎల్లమ్మ టెంపుల్ ఏరియా, కోటిరత్న హాస్పిటల్ , జిఎంఆర్ కాలనీ, రాజమౌళి హాస్పిటల్ బ్యాక్ సైడ్ కెనరా బ్యాంక్ ఏరియా, సెంట్ మేరీ స్కూల్, కలెక్టర్ ఆఫీస్, ఎన్ ఎం ఆర్ ఫంక్షన్ హాల్, దూడడి శ్రీనివాస్ ఇంటి ఏరియా తదితర ప్రాంతాలలో గత నెల 28వ తేదీన రాత్రి 7-00గంటల నుండి 9:30 గంటల వరకు నాతో పాటు వార్డు ఆఫీసర్ అయిన నిఖిల్ రెడ్డి పర్యటించి వీధిలైట్లను పరిశీలించడం జరిగిందని, మా పరిశీలనలో 60 లైట్లు వెలగనివి ఉన్నాయని. అలాగే రిపేరు చేయవలసినవి అడ్జస్ట్మెంట్ 5 ఉన్నాయి. మేము పరిశీలిస్తున్నప్పుడు చాలామంది ప్రజలు ఈలైట్లు వెలగక సంవత్సరము, రెండు సంవత్సరాలు అవుతుందని, తెలిపారు. శివారు ప్రాంతంగా ఉండడం ఈవార్డును ఆనుకొని గార్లకుంట ఉండడం వల్ల తీవ్రమైన విషపురుగులు పాములు రాత్రి వేళలో వస్తున్నాయి. వాటివల్ల తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని, రాత్రి వేళలో దొంగలు బెడద కూడా ఉందని, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున కమీషనర్ వెంటనే చర్యలు తీసుకొని తక్షణం వార్డులో లైట్ల సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# సంత్ కబీర్, జాతీయ చేనేత అవార్డులకు దరఖాస్తులకు ఆహ్వానం

## చేనేత, జౌళి శాఖ

## సహాయ సంచాలకులు చౌడేశ్వరి

జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 04(ప్రభాత ఉదయం)

జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం -2025 సంవత్సరానికి గాను "సంత్ కబీర్, జాతీయ చేనేత అవార్డులకు" జిల్లాలోని చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు చౌడేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు చేనేత కళాకారులకు, చేనేత డిజైనర్లకు, మర్కేటర్లకు వారి నైపుణ్యత అలాగే ప్రత్యేకతల ఆధారంగా ఇవ్వడంజరుగుతుందన్నారు. ఆసక్తి గల ఔత్సాహిక చేనేత కార్మికులు, డిజైనర్లు ఈ నెల 23వ తేదీ లోగా www.handlooms.nic.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.అర్హతలు, దరఖాస్తు ఫారము కొరకు పైన తెలిపిన వెబ్ సైట్ లో చూడగలరని పేర్కొన్నారు. అదే విధంగా ఇతర వివరముల కోసం సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖ, జనగామ అలాగే చేనేత సేవా కేంద్రం (వీవర్స్ సర్వీస్ సెంటర్ ) హైదరాబాద్ వారి కార్యాలయములను సంప్రదించగలరని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న ఎంఆర్పిఎస్ నాయకులు

# కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో మాదిగల వర్గానికి ఒక సీటు కేటాయించాలి

## జనగామ డీసీసీ అధ్యక్షురాలికి వినతిపత్రం అందచేసిన ఎంఆర్పిఎస్

జనగామ జిల్లా ప్రతినిధి మార్చి 04(ప్రభాత ఉదయం):

రాజ్యసభలో మాదిగల వర్గానికి ఒక సీటు కేటాయించాలని బుధవారం ఎంఆర్పిఎస్ తరపున జనగామ డీసిసి అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మినారాయణ లకావత్ కు వినతిపత్రం అందించారు. డీసీసీ ద్వారా ఏఐసీసీ కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలియజేయాలని అభ్యర్థించారు.డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మి నారాయణ లకావత్ సానుకూలంగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికి సమాన న్యాయం చేస్తుందని, గత ఎన్నికల్లో బిసి వర్గానికి ఇచ్చిన మాటను పాటిస్తూ సీట్లు కేటాయించామని తెలిపారు. అదనంగా, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నాకు డీసీసీ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించడం ద్వారా సామాజిక న్యాయం చేస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. కాంగ్రెస్ పార్టీ ఏకైక పార్టీగా ఈ విధంగా సామాజిక న్యాయం చేస్తున్నది అని స్పష్టం చేశారు.ఎంఆర్పిఎస్ చేసిన అభ్యర్ధన ను టీపీసీసీ, ఏఐసీసీ దృష్టి కి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, ఎంఆర్పిఎస్ నాయకులు జేరిపోతుల సుధాకర్, సందేనా రవీందర్, బోట్ల మహేష్, గువ్వల రవి, జేరిపోతుల రఘు, తదితరులు పాల్గొన్నారు.




# జలమండలి మహిళా ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

హైదరాబాద్, మార్చి 4(ప్రభాత ఉదయం)

అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యంలో.. జలమండలి ఉద్యోగినులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. టీ ఎక్స్ ఆసుపత్రి, జలమండలి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ మెడికల్ క్యాంప్ ను.. ఎండీ అశోక్ రెడ్డి జేఎండీ మయాంక్ మిట్టల్ తో కలిసి ప్రారంభించారు.ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం జరిగింది. ఇందులో 70 మందికి పైగా మహిళా ఉద్యోగులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వీరికి బీపీ, షుగర్, ఈసీజీ, కంటి చూపు, స్కిన్, హెయిర్, బీఎంఐ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పర్సనల్ మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జిఎం సరస్వతి, జలమండలి ఉమెన్స్ మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, జనరల్ సెక్రటరీ బిల్కిస్ బాను, వైస్ ప్రెసిడెంట్ తనూజ, కోశాధికారిని సాయి సునీత, బోర్డు మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



వినతిపత్రం ఇస్తున్న ఎంపీ చామల

# ఆయకట్టును స్థిరీకరించాలని మంత్రి ఉత్తమ్‌కు ఎంపీ చామల వినతి

జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 04(ప్రభాత ఉదయం):

సిద్దిపేట జిల్లా పరిధిలోని రంగనాయక సాగర్ రిజర్వేయర్ నుండి డి10 కెనాల్ నుంచి జనగామనియోజకవర్గంలోని కొమురవెల్లి మండలంలో తపాస్ పల్లి రిజర్వేయర్ డి3 కెనాల్ పరిధిలో ఉన్న ఆయకట్టును స్థిరీకరణ చేసి దూల్మిట్ట, చేర్యాల మండలాల పరిధిలోని కమలాయపల్లి, అర్జున్ పట్ల, ఆకునూరు, జాలపల్లి, లింగాపూర్, దూల్మిట్ట గ్రామాల పరిధిలోని సుమారు 7 వేల ఎకరాలకు రంగనాయక సాగర్ డి10 కెనాల్ కింద స్థిరీకరించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకరం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.గతంలో కూడా ఈ ప్రాంత ప్రజల అవసరాల కోసం భువనగిరి ఎంపీ చామల వినతిపత్రం సమర్పించగానే వెంటనే స్పందించిన మంత్రి తాత్కాలిక జీవోను ఇచ్చి నీళ్లు వచ్చేలా చేశారు.రాబోయే ఎండాకాలన్ని దృష్టిలో పెట్టుకొని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి చెరువులకు నీటిని సరఫరా చేసి సాగునీరు అందించాలని, అలాగే గతంలో ఇచ్చిన తాత్కాలిక జీవో కాకుండా పర్మినెంట్ జీవో ఇవ్వాలని మంత్రిని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.



కొంగరి చెంద్రయ్యకు నివాళి అరిపిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# కొంగరి శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చిన బిఆర్ఎస్ నాయకులు

జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 04(ప్రభాత ఉదయం):

జిల్లా లోని దేవరుప్పుల మండలం, అప్పి రెడ్డి పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకుడు కొంగరి శ్రీనివాస్ తండ్రి కొంగరి చంద్రయ్య అనారోగ్యంతో మంగళవారం మరణించగా, బుధవారం బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి మనోధైర్యం కల్పించి చంద్రయ్య పార్థివదేహంపై పూలమాల వేసి నివాళి అరిపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి సుడిగెల హనుమంతు, పాము మోహన్, మేకల సంపత్, ఎండి కాసిం, కౌడగాని అంజయ్య, పులిగిల్ల సుధాకర్, బాషిపల్లి కోటి, కాంటారి సత్యనారాయణ, పిట్టల సోమయ్య, లోనే మహేందర్, దండు నర్సింహులు , దండు కొమురయ్య, నాగారపు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 4 ( ప్రభాత ఉదయం)

బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన అందరు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహ అన్నారు. బుధవారం గద్వాల మండలం జిల్లెడబండ గ్రామంలో కమ్యూనిటీ అవేర్నెస్ ప్రోగ్రాం మహిళా , శిశు సంక్షేమ శాఖ 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీవో నరసింహ ముఖ్య అతిథిగా హాజరై బాల్య వివాహాలు , వాటి వాళ్ళ జరిగే అనర్తల గురించి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శివలీల, సూపర్వైసర్ దస్తగిరి, గ్రామసర్పంచ్ నాగేష్ , పంచాయతీ సెక్రెటరీ కవిత, హెచ్ యు బి-డి హెచ్ ఈ డబ్ల్యూ చిట్టెమ్మ, సరోజ, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608